సాక్షి నారాయణపేట


సోమవారం ; 29 ; సెప్టెంబర్ ; 2025



కాళరాత్రిదేవీ నమోస్తుతే..

మహిమాన్వితమూర్తి కాళరాత్రిదేవి నమోస్తుతే.. అంటూ భక్తులు జోగుళాంబ అమ్మవారిని పూజించారు.

-8లో ▸



జూరాలకు భారీ వరద

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 5.07 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది.

-8లో ▸

గరిష్టం/కనిష్టం
26.1 /16.8

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కులవివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు



నారాయణపేట రూరల్: ఏడు దశాబ్దాల స్వతంత్ర భారత్‌ను పట్టిపీడిస్తున్న కులవివక్ష నిర్మూలనకు పోరాటమే సరైన మార్గమని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి బి.రాము అన్నారు. జిల్లాకేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని కులవ్యవస్థ భారత దేశంలో ఉందని.. రాజకీయ ప్రజాస్వామ్య విలువలకు ఆటంకంగా మారిందన్నారు. కులవివక్ష నిర్మూలన ఆచరణాత్మక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ సభలు జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మనుషులంతా సాంఘిక సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామిక విలువలు, సమసమాజ నిర్మాణం కోసం ఏకం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు కాశీనాథ్, నర్సింహులు, జయ, ప్రశాంత్, శారద, సౌజన్య, లక్ష్మి, భాగ్యలక్ష్మి, రాధిక, అనిత తదితరులు ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



నారాయణపేట రూరల్: బీజేపీ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగురావు నామాజీ పిలుపునిచ్చారు. ఆదివారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు పోశల్ వినోద్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు తిరుపతిరెడ్డి, లక్ష్మీగౌడ్, బలరాంరెడ్డితో పాటు జిల్లా మాజీ అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాసులును శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నాగురావు నామాజీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మదన్, లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ, ప్రభంజాన్, మొగులప్ప, కిరణ్, సూర్యకాంత, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఆశలు ఆవిరి!

జెడ్పీ పీఠం జనరల్ మహిళకు రిజర్వుతో కంగుతిన్న నాయకులు



జిల్లా పరిషత్ కార్యాలయం

- రిజర్వేషన్ల తారుమారుతో నిరాశలో ఆశావహులు
- అంతర్మథనంలో రాజకీయ నేతలు
- సతీమణులను రంగంలోకి దించేందుకు సన్నద్ధం

నారాయణపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశించిన ఎంతో మంది ఆశలు ఆవిరయ్యాయి. తమకు అనుకూలంగా రిజర్వేషన్లు వస్తాయనుకొని కలలుగన్న ఆశావహులు.. కొన్ని రోజులుగా అడ్డగోలుగా ఖర్చుచేస్తూ వచ్చారు. తీరా రిజర్వేషన్లు అనుకూలంగా రాకపోవడంతో కంగుతిన్నారు. ఇన్నాళ్లు తాము ఆశపడిన స్థానం ఇంకెవరికో వెళ్లిపోయిందంటూ మనోవేదన చెందుతున్నారు. జిల్లాలోని 13 మండలాల్లో జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్, వార్డు స్థానాలకు శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిజర్వేషన్లు ఖరారుచేసి.. అధికారికంగా వెల్లడించిన విషయం విధితమే. అయితే అనేక స్థానాలు ఇతర సామాజిక వర్గాలకు రిజర్వు కావడంతో ఆశావహులు నిరాశలో పడిపోయారు.

మారిన సీన్..

రిజర్వేషన్లు తారుమారు కావడంతో పొలిటిషన్స్ సీన్ మారిందని చెప్పవచ్చు. సీఎం ఇలాకాలోని మద్దూర్ మండలంలో ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు రెండు ఎస్టీ జనరల్‌కు రిజర్వు కావడం.. అలాగే మంత్రి వాకిటి శ్రీహరి ఇలాకాలోని ఊట్కూర్ మండలంలో ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు ఎస్సీ జనరల్ కావడంతో ఆశావహుల కలలపై ఒక్కసారిగా నీళ్లు చల్లినట్లయ్యింది.

తెరపైకి కొత్త ముఖాలు..

స్థానిక సంస్థల స్థానాలకు రిజర్వేషన్ల ఖరారుతో కొత్త ముఖాలు తెరపైకి వస్తున్నాయి. రాజకీయంగా దూకుడుగా ఉన్నవారు వెనక్కి తగ్గగా.. ఇప్పటి వరకు రేసులో లేని వారు ప్రధాన పార్టీల తరఫున పోటీ చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. రిజర్వేషన్ల ప్రకటనతో గ్రామాల్లో రాజకీయం ఒక్కసారిగా మారిపోయింది. చివరి వరకు ఎవరు పోటీలో ఉంటారో.. ఎవరు తప్పుకొంటారో తెలియని పరిస్థితి నెలకొంది. స్థానిక రాజకీయాల్లో ఎవరికి ఎవరూ మద్దతిస్తారో.. ఎవరిని గెలిపిస్తారనే చర్చ జోరుగా కొనసాగుతోంది.

ఏడాదిగా భారీగా ఖర్చు..

ఆశావహులు తమకే అనుకూలంగా రిజర్వేషన్లు వస్తాయనే నమ్మకంతో ఏడాదిగా గణేశ్, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు, ఇతర పండుగల నిర్వహణకు భారీగా విరాళాలు ఇవ్వడంతో పాటు అన్నదానాలు, యజ్ఞ కార్యక్రమాలకు పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తూ వచ్చారు. దావత్‌ల కోసం రూ.లక్షలు ఖర్చుచేశారు. తీరా రిజర్వేషన్లు తారుమారు కావడంతో గొంతు మూగబోయినంత పనైందని చెప్పవచ్చు. ఎన్నికల ఖర్చుకోసం ఆస్తులను సైతం అమ్ముకునేందుకు కొందరు సిద్ధపడినట్లు తెలిసింది.

తీవ్ర నిరాశలో రాజకీయ నేతలు..

రాజకీయాల్లో తామేంటో నిరూపించుకోవాలని.. ప్రజాక్షేత్రంలో ఓ వెలుగు వెలగాలని కలలుగన్న ఆశావహులకు నిరాశే మిగిలింది. జెడ్పీ చైర్మన్ స్థానం జనరల్‌కు రిజర్వు అయితే అధికార పార్టీకి చెందిన డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు చిట్టెం అభిజయ్ రెడ్డి, మద్దూర్ మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కోస్గి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మక్తల్‌లో బాలకిష్టారెడ్డి, ఊట్కూర్‌లో ఎల్కోటి జనార్దన్‌రెడ్డి, నర్వలో జలంధర్‌రెడ్డి, సీతాదయాకర్‌రెడ్డి తనయుడు సిద్ధార్థరెడ్డి పోటీ చేయాలని భావించారు. ప్రస్తుతం జెడ్పీ చైర్‌పర్సన్ స్థానం జనరల్ మహిళకు రిజర్వు కావడంతో ఆశావహులంతా అంతర్మథనంలో పడినట్లు చర్చ సాగుతోంది. రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వస్తాయని ఆశించిన పలువురికి అధికారులు ప్రకటించిన రిజర్వేషన్లు నిద్రపట్టకుండా చేశాయని బహిరంగంగా చెబుతున్నారు. సామాజిక వర్గాల మార్పుతో కొందరు, పురుషులకు రిజర్వు అవుతుందనుకున్న స్థానంలో మహిళలకు, తమ సామాజిక వర్గానికి రిజర్వు అవుతుందని ఆశ పడిన స్థానం మరో సామాజిక వర్గానికి రిజర్వు కావడంతో ఆశలన్నీ అడియాశలయ్యాయంటూ తలలు పట్టుకుంటున్నారు.

రిజర్వేషన్ల రాజకీయం అంటే ఇదేనేమో!

జిల్లాలోని జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్ స్థానాలకు ఖరారు చేసిన రిజర్వేషన్లు ఒక్కసారిగా రాజకీయ విశ్లేషకులను సైతం ఖంగుతినిపించాయని చెప్పవచ్చు. రిజర్వేషన్లలో సైతం రాజకీయం అంటే ఇదేనేమోనంటూ చర్చ కొనసాగుతోంది. జిల్లాలోని సీఎం ఇలాకాలో ముందుగా ఎస్టీ స్థానాలను రిజర్వు చేయడం.. అందులో మద్దూర్ మండలంలో ఎస్టీల జనాభా ఎక్కువగా ఉండటం వల్ల జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను కట్టబెట్టడం.. కోస్గిలో ఎస్సీకి రిజర్వు కావడం, మక్తల్ నియోజకవర్గంలోని ఊట్కూర్‌లో ఎస్సీ జనరల్ స్థానాలు కేటాయించడంపై సర్వత్రా చర్చ సాగుతోంది. గ్రామపంచాయతీల్లో సర్పంచ్ స్థానాల్లో సైతం రిజర్వేషన్లు ఆశావహులను నిరాశకు గురిచేశాయని చెప్పవచ్చు. ఈ రిజర్వేషన్లను జీర్ణించుకోలేని పరిస్థితిలో రాజకీయ నేతలు ఉన్నారని తెలుస్తోంది.

రంగంలోకి సతులు..

జెడ్పీ చైర్‌పర్సన్ పీఠం జనరల్ మహిళకు రిజర్వు కావడంతో ఆశావహులు తమ సతులను రంగంలోకి దించేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీలో మక్తల్‌కు చెందిన బాలకిష్టారెడ్డి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్, బీఆర్‌ఎస్‌లో మాజీ ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి తమ సతీమణులను రంగంలోకి దింపి జెడ్పీ పీఠం దక్కించుకునే పనిలో పడినట్లు తెలిసింది.

టికెట్ దక్కేదెవరికో.. అదృష్టం వరించేదెవరికో

జిల్లాలోని 13 మండలాల్లో జెడ్పీటీసీ స్థానాలను రిజర్వేషన్ల వారీగా పరిశీలిస్తే, టికెట్ దక్కేదెవరికో.. జెడ్పీ చైర్‌పర్సన్ పీఠం ఎవరికి వరిస్తుందోననే చర్చ సాగుతోంది. నారాయణపేట నియోజకవర్గంలోని ధన్వాడ, మక్తల్ నియోజకవర్గంలో మక్తల్, కృష్ణా మండలాల్లో జనరల్ మహిళ, సీఎం ఇలాకాలోని కొత్తపల్లి మండలంలో జనరల్ మహిళ స్థానాలు ఖరారయ్యాయి. మాగనూర్, నర్వ, గుండుమాల్ మండలాల్లో బీసీ మహిళలకు, కోస్గి మండలంలో ఎస్సీ మహిళకు రిజర్వు అయ్యాయి. మొత్తం 13 స్థానాలకు గాను 6 స్థానాలు మహిళలకు రిజర్వు కావడంతో.. అందులో ఎవరికో ఒకరికి అదృష్టం దక్కే అవకాశం ఉంది. కాగా, ధన్వాడ, మక్తల్ స్థానాలు జనరల్ కావడంతో ఆయా స్థానాల్లో సైతం మహిళలను రంగంలోకి దించే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే, జెడ్పీపై ఆశలు పెట్టుకున్న వారు సైతం బీసీ జనరల్ స్థానాలైనా నారాయణపేట, మరికల్, దామరగిద్ద మండలాల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నుంచి మహిళా నేతలతో పోటీ చేయించే సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనప్పటికీ ఈసారి 13 మండలాల్లో మహిళలకు 6 స్థానాలు రిజర్వు కాగా.. 10 స్థానాల్లో పోటీ చేయించే పనిలో అధికార, విపక్ష పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే

హామీలు మరిచిన కాంగ్రెస్‌కు బాకీ కార్డుతో బుద్ధి చెప్పాలి

- స్థానిక ఎన్నికల్లో ఆ రెండు పార్టీలను బొందపెట్టాలి
- అసమర్థత వల్లే యూరియా కోసం క్యూలైన్లు మళ్లీ వచ్చాయి
- అచ్చంపేట జనగర్జన బహిరంగ సభలో కేటీఆర్ వ్యాఖ్యలు

అచ్చంపేట రూరల్: రాష్ట్రాన్ని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బొందపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని.. ఆ రెండు పార్టీలు దొందూ దొందేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అన్నారు. ఆదివారం అచ్చంపేటలో నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బీఆర్‌ఎస్ జనగర్జన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి.. 90 శాతం పనులు పూర్తిచేస్తే.. మిగిలిన 10 శాతం పనులను కూడా పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఒకవేళ ప్రాజెక్టులను పూర్తిచేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే దురుద్దేశంతోనే ప్రభుత్వం పనులు చేపట్టడం లేదని దుయ్యబట్టారు. ఆల్మట్టి ఎత్తు పెరిగితే కొడంగల్ లిఫ్ట్, పాలమూరు ఎత్తిపోతలు, శ్రీశైలం డ్యాం నిరుపయోగంగా మారుతాయన్నారు. గతంలో రాజోలి బండ కోసం 2001లో కేసీఆర్ పాదయాత్ర చేసినప్పుడు సుంకేసుల తూములను బాంబులతో పేలుస్తామన్న రాయలసీమ ఎమ్మెల్యేకు, వెయ్యి బాంబులతో మొత్తం బ్యారేజ్‌ను తునాతునకలు చేస్తామని కేసీఆర్ ధీటుగా బదులిచ్చారని గుర్తుచేశారు. అలాంటి దమ్ము, తెగువ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి లేదా అని ప్రశ్నించారు. దక్షిణ తెలంగాణను ఎండబెట్టే కుట్రలపై ఢిల్లీలో ఉన్న రాహుల్‌గాంధీ, ఇక్కడ ఉన్న రేవంత్‌రెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. ప్రాజెక్టుతో ఏ సంబంధం లేని జైపాల్‌రెడ్డి పేరు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌తో అచ్చంపేట నియోజకవర్గంలోని 90 వేల ఎకరాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాగునీళ్లిచ్చిందన్న కేటీఆర్, మరో 70 వేల ఎకరాలకు నీళ్లిచ్చేందుకు రూ.1,350 కోట్లతో అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని కూడా మంజూరు చేసిందన్నారు. అచ్చంపేట బిడ్డ అని చెప్పుకొనే రేవంత్ రెడ్డి ఆ పథకాన్ని పూర్తి చేయకుండా పక్కన పెట్టారని మండిపడ్డారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



అచ్చంపేటలో జనగర్జన సభకు హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

కాంగ్రెస్ బకాయి కార్డు ఉద్యమం

కాంగ్రెస్ దోఖాను ప్రజలకు గుర్తుచేయడానికే 'కాంగ్రెస్ బకాయి కార్డు' ఉద్యమాన్ని ప్రారంభించామని కేటీఆర్ అన్నారు. స్థానిక ఎన్నికలకు ఓట్లు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రజలు ఈ బాకీ కార్డు చూపించి నిలదీయాలన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయిన తెలంగాణ ప్రజలు నేడు గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో కనుమరుగైన యూరియా బస్తాల క్యూలైన్లు ఈ ప్రభుత్వ అసమర్థత వల్ల మళ్లీ వచ్చాయని, లైన్లలో నిలబడి రైతులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా ఇవ్వకుండా, రైతుబంధు వేయకుండా, వడ్లకు బోనస్ చెల్లించకుండా రేవంత్‌రెడ్డి రైతులను అరిగోస పెడుతున్నారని విమర్శించారు. తెలంగాణలో నడుస్తున్నది కాంగ్రెస్– బీజేపీ జాయింట్ వెంచర్ ప్రభుత్వం అని సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రం దివాలా తీసిందని చెబుతూ తెలంగాణ పరువును బజారుకీడుస్తున్నారని, హామీలపై నిలదీస్తే 'నన్ను కోసుకు తింటారా?' అని మాట్లాడటం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. మాట తప్పిన రేవంత్ రెడ్డిని ఎన్నికల్లో రాజకీయంగా బొంద పెట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, అడ్డగోలు మాటలతో తెలంగాణ పరువు తీస్తున్న రేవంత్ సర్కార్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

⇨ అచ్చంపేటలో ఎవరో పార్టీ వీడారని బాధపడాల్సిన అవసరం లేదని, ప్రజల అభిమానం ఉన్న నాయకుడిని కేసీఆర్ త్వరలోనే పంపిస్తారని కేటీఆర్ భరోసా ఇచ్చారు. తిరిగి కేసీఆర్ సీఎం కావాలంటే అచ్చంపేటలో గులాబీ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, మాజీమంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాష్ట్ర నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు మనోహర్, శ్రీకాంత్‌భీమ, నర్సింహగౌడ్, రమేష్‌రావు పాల్గొన్నారు.

ముంపు ముప్పు

- కృష్ణా, భీమా నదుల్లో పెరిగిన వరద ఉధృతి
- భయం గుప్పిట్లో నదీ తీర గ్రామాల ప్రజలు
- వాసునగర్‌ను ఖాళీ చేయాలని రెవెన్యూ అధికారుల సూచన

మక్తల్/కృష్ణా: రెండు రోజులుగా కృష్ణా, భీమా నదుల్లో వరద ఉధృతి భారీగా పెరిగింది. నదీ తీర గ్రామాల సమీపాల్లో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఇప్పటికే నదీ పరీవాహకంలోని వందలాది ఎకరాల పంట పొలాలు నీటమునిగాయి. కృష్ణా మండలంలో కృష్ణానది ఒడ్డున ఉన్న వాసునగర్, మారుతీనగర్ గ్రామాలతో పాటు భీమా నదీ తీరంలోని హిందూపూర్ గ్రామంలోకి వరద నీరు చేరే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం నదీ తీర ప్రాంతాల్లోని గ్రామాలను తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్‌ఐ ఎండీ నవీద్ పరిశీలించి.. ప్రజలను అప్రమత్తం చేశారు. వాసునగర్, మారుతీనగర్ గ్రామాల ప్రజలు తక్షణమే ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. అదే విధంగా భీమా నది నుంచి హిందూపూర్‌లోని ఎస్సీ కాలనీలోకి వరద నీరు చేరే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు. కాలనీవాసులు సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని సూచించారు. ఇదిలా ఉంటే, 2009లో అకస్మాత్తుగా సంభవించిన వరదల కారణంగా ఆయా గ్రామాల ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు, భయానక పరిస్థితులు ఇప్పటికీ ఎవరూ మరిచిపోలేదు. మరోసారి వరద ముంపు ముప్పు భయం నదీ తీర గ్రామాల ప్రజలను వెంటాడుతోంది. రెండు రోజులుగా భీమా, కృష్ణా నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో చాలా చోట్ల వ్యవసాయ పొలాలు నీటమునగడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. మండల వ్యవసాయాధికారి సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది బృందాలుగా ఏర్పడి మునకకు గురైన పంటలను పరిశీలించారు. కృష్ణా మండలంలో 185 మంది రైతులకు చెందిన 785 ఎకరాల వరిపంట నీటమునిగి నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. అదే విధంగా భీమా నది పరీవాహక ప్రాంతంలోని సూకూర్‌లింగంపల్లి, కుసుమర్తి, తంగిడి గ్రామాల్లో పంట పొలాల్లోకి నీరు వచ్చి చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా మక్తల్ మండలం పస్పుల ఘాట్ వద్ద ఉన్న దత్తక్షేత్రంలోకి వరద చేరింది. కృష్ణానదిపై ఉన్న నారాయణపూర్, భీమానదిపై ఉన్న గూడూరు బ్రిడ్జి కం బ్యారేజీ నుంచి 5.20లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో వరద ఉధృతి పెరిగిందని అధికారులు తెలిపారు. నదీ తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



రాష్ట్ర సరిహద్దులోని భీమా నదిపై ఉన్న గూడూర్ బ్యారేజీ వద్ద వరద ఉధృతి



మక్తల్ మండలం పస్పుల దత్తక్షేత్రం వద్ద ఇలా..



వాసునగర్‌ను ఖాళీ చేయాలని గ్రామస్తులకు సూచిస్తున్న అధికారులు



భీమానదిలో వరద ఉధృతితో నీటమునిగిన పంటపొలాలు

పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి



నారాయణపేట రూరల్: పెంపుడు జంతువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని జిల్లా వెటర్నరీ అధికారి డా.ఈశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఆదివారం ప్రపంచ యాంటీ రేబిస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లలో పెంచుకునే కుక్కలు, పిల్లలకు మూడు నెలల వయసు రాగానే యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. నెల రోజుల తర్వాత మరోమారు బూస్టర్ టీకా వేయించాల్సి ఉంటుందన్నారు. మనుషులకు పిల్లి, కుక్క, కోతులు కరిచినప్పుడు వరుసగా 3, 7, 14, 28వ రోజు టీకాలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కుక్క కాటు వల్ల రేబిస్ వ్యాధి సంక్రమిస్తుందని.. కుక్కల లాలాజలం నుంచి ఈ వైరస్ వ్యాప్తి చెందుతుందన్నారు. జంతువులు కాటు వేసినప్పుడు నిర్లక్ష్యం చేయరాదన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే తప్పనిసరిగా వైద్యం తీసుకోవాలన్నారు. రేబిస్ డే సందర్భంగా జిల్లావ్యాప్తంగా 197 పెంపుడు జంతువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి అనిరుధ్ ఆచార్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసం

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞానసరస్వతి ఆలయంలో మూలా నక్షత్రం సందర్భంగా సోమవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

- ఏటీసీ సెంటర్ల ఏర్పాటుతో యువతకు ఉద్యోగావకాశాలు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే క్యాన్సర్ నివారణకు ప్రత్యేక చర్యలు
- ప్రతి జిల్లాకు పాలశీతలీకరణ కేంద్రాలు మంజూరు
- రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి వెల్లడి



ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి

వంగూరు: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యక్రమంలో విద్య, వైద్యంపై ప్రత్యేకంగా దృష్టిసారించిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో రూ.134 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆదివారం మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 8 మెడికల్ కళాశాలలు, 74 ట్రామా, 102 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశామని.., క్యాన్సర్ నివారణకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగావకాశాల కోసం ఏటీసీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 65 సెంటర్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర యువతకు నైపుణ్యమైన విద్యనందించి ప్రపంచంతో పోటీపడే విధంగా తీర్చిదిద్దేందుకు ఒక్కో ఏటీసీ సెంటర్‌కు రూ.45 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామంపై మమకారంతో అన్ని రంగాల్లో గ్రామాన్ని అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు.

⇨ రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాడిపరిశ్రమ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతి జిల్లాలో పాలశీతలీకరణ కేంద్రాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కొండారెడ్డిపల్లిలో రూ.2.50 కోట్లతో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయడం వల్ల రోజుకు 30వేల లీటర్ల పాలను నిల్వ చేయవచ్చని తెలిపారు. అంతకు ముందు గ్రామంలోని ఆలయాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, బాలాజీసింగ్ పాల్గొన్నారు.

గుండె లయ తప్పుతోంది!

- అలవాట్లు అదుపు చేసుకుంటేనే రక్ష
- గుండె సంబంధిత రోగాలకు జీవనశైలే ప్రధాన కారణం
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న గుండెపోటు మరణాలు

నేడు వరల్డ్ హార్ట్ డే




పాలమూరు: ఏడాదిగా జిల్లాలో గుండె మరణాలు అధికమయ్యాయి. ఒకప్పుడు గుండెపోటు వయసు పైబడిన వారికి మాత్రమే వచ్చేది.. ప్రస్తుత పరిస్థితుల్లో 16ఏళ్ల బాలుడి నుంచి 90ఏళ్ల వృద్ధుడి వరకు వస్తోంది. మానసిక ఒత్తిళ్లతో తీసుకునే అల్కహాల్ దగ్గరి నుంచి ఆహారపు అలవాట్ల వరకు గుండె లయతప్పడానికి దోహదం చేస్తాయి. రెండేళ్లుగా గుండెపోటు మరణాలు కాస్త పెరిగాయి. దీనికితోడు కరోనా వంటి మహమ్మారితో ఈ కేసులు మరింత రెట్టింపయ్యాయి. శరీరానికి పెద్ద దిక్కుగా వ్యవహరించే హృదయం లయ తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. నేడు(సోమవారం) వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

మనిషి శరీరంలో పనిచేసే అవయవాల్లో అతి ప్రధానమైంది గుండె.. ప్రస్తుతం దీనికి భద్రత లేకుండా పోతుంది. శారీరక వ్యాయామం లేకపోవడం.. వేళాపాళా లేని భోజనాలు.. పొగతాగడం.. ఒత్తిళ్లు.. చివరికి గుండెపోటుకు గురవ్వుతున్నారు. మనుషుల్లో మారుతున్న అలవాట్లతో ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, మూత్రపిండాల సమస్యలకు దారితీయడంతోపాటు అంతిమంగా గుండెపై ఆ ప్రభావం పడుతోందని తెలుస్తోంది. అధిక కొవ్వు పెరగడంతో అంతిమంగా గుండెపోటుకు గురై ప్రాణాలు వదులుతున్న ఘటనలు అనేకం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గుండె సమస్యలతో బాధపడే వారు 35శాతం ఉన్నట్లు అంచనా. వీరిలో మగవారు 22శాతం, మహిళలు 13 శాతం ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో 40 శాతం, పట్టణాల్లో వీర సంఖ్య 56శాతం ఉంటుందని వైద్యాధికారులు తేల్చారు. ఆకస్మిక హృద్రోగ సమస్య ఎదురైన వారిలో 10శాతం మంది మాత్రమే చికిత్స తీసుకుని కోలుకుంటున్నారు.

ఛాతిలో నొప్పి వస్తే జాగ్రత్త

ఆకస్మాత్తుగా ఛాతిలో నొప్పి వస్తే వెంటనే అప్రమత్తమవ్వాలి. గుండె రక్తనాళాలు మూసుకుపోయి రక్త ప్రసరణ తగ్గిపోవడంతోనే ఛాతిలో నొప్పి వస్తోంది. దీన్ని 'ఎంజైనా'అంటారు. ఛాతిలో బరువుగా ఉండటం, నొప్పి వీపు వెనుక భాగంలోకి రావడం, గోంతులోకి, భుజం మీదికి పాకడం, ఆయాసం, కళ్లు తిరగడం, చెమటలు పట్టడం, కడుపులో గ్యాస్ ఏర్పడినట్లుగా మంట వస్తోంది. ఛాతిలో నొప్పి ప్రారంభమైన వెంటనే వైద్యుడిని సంప్రదించేలోగా 'సార్బిట్రేట్, ఆస్ప్రిన్, స్టాటిన్ మాత్రలను వేయాలి. ఆ తర్వాత గంట వ్యవధిలోగా ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించగలిగితే ప్రాణాపాయ స్థితినుంచి కాపాడే అవకాశం ఉంది.

ఇలా చేస్తే మేలు



- గుండెకు సంబంధించిన రోగాలు పెరుగుతున్న నేపథ్యంలో కష్టమైనా సరే కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకొని వాటిని తప్పక పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా జీవనశైలిని మార్చుకోవడంతో చాలావరకు ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని స్పష్టం చేస్తున్నారు.
- రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. కనీసం వారంలో అయిదు రోజులైనా వేగవంతమైన నడక, ఈత, స్కిప్పింగ్, షటిల్ వంటివి అవసరం. శరీరానికి చెమట పట్టాలి. నిత్యం 45నిమిషాలు నడిచినా సరిపోతుంది.
- ప్రతినిత్యం వ్యాయామం చేస్తే శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. తద్వారా ఒత్తిడి తగ్గడంతో పాటుగా మధుమేహం, అధిక రక్తపోటు సమస్యలు అంతత్వరగా దరిచేరవు.
- ఇంటి భోజనానికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆహారంలో గుడ్లు, పండ్లు, తాజా కాయ, ఆకుకూరలు, చేపలు ఉండేలా చూసుకోవాలి. ప్రతిరోజూ 400గ్రాములకు తక్కువ కాకుండా పండ్లు, ఆకు, కాయకూరలు అవసరం.
- ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలి. మద్యం తాగుతున్నప్పుడు చాలామంది ఎక్కువ ఆహారాన్ని తీసుకొంటారు. ఇది కాలేయంలో ఇతర శరీర భాగాల్లో కొవ్వు కింద పేరుకొని అధిక బరువుకు కారణమవుతుంది.
- ప్రధానంగా పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారాన్ని ప్రాధాన్యం ఇవ్వాలి. తృణ ధాన్యాలతో చేసిన పదార్థాలు తీసుకోవాలి.

మధుమేహంతో ముప్పు అధికం

మారుతున్న జీవనశైలి, స్తబ్ధమైన యాంత్రిక జీవనం, పెరుగుతున్న మానసిక ఒత్తిడి, సమయ పాలనలేని ఆహారం, రక్తపోటు, షుగర్ వ్యాధితోపాటు శరీర బరువుపై అదుపు కోల్పోవడం, వైద్య పరీక్షలకు నిర్లక్ష్యం చేయడంతో గుండె సమస్యలకు ప్రధాన కారణం. దీంతోపాటు మధుమేహం అధిక ముప్పుగా మారింది. అధిక రక్తపోటు, ఊబకాయ సమస్యలూ తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. జీవన శైలిలో వస్తున్న పెను మార్పులతో ఈ పరిస్థితి ఏర్పడుతోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఈ సమస్య ఇంకా అధికమయ్యే ప్రమాదం ఉంది.

20 ఏళ్ల లోపు వ్యక్తులకు గుండెపోటు



20 ఏళ్ల కిందట 50 ఏళ్లు దాటిన వృద్ధులకు మాత్రమే వచ్చేది. నేడు మారిన జీవనశైలితో 20 ఏళ్ల యువకుల నుంచి 70ఏళ్ల వృద్ధుల వరకు వస్తోంది. 30 ఏళ్ల యువకులు అధికంగా ఉంటున్నారు. ఒత్తిడి, ధూమపానం, మద్యం, షుగర్, బీపీ, లావు, చెడు కొలస్ట్రాల్ పెరగడం ప్రధాన కారణం. ప్రతి ఒక్కరూ జీవనశైలి, ఆహార అలవాట్లు మార్చుకోవాలి. – సంపత్‌కుమార్ సింగ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, నారాయణపేట

చిన్న వయస్సు వారికి పెరిగాయి



గుండెపోటు ఒకటే సమస్య కాదు. లయబద్ధంగా కొట్టుకోకపోవడం, చిన్న వయసులో జనటిక్ సమస్యలతో గుండె బలహీనపడుతోంది. కరోనా తర్వాత చిన్న వయస్కులు, అందులో పురుషులకు ఎక్కువగా గుండెపోటు వస్తోంది. బేకరి ఫుడ్, బిర్యానీ, మాంసం తక్కువగా తీసుకోవాలి. బరువును అదుపులో ఉంచుకోవాలి. జిల్లాలో కొవిడ్ కారణంగా 50నుంచి 60శాతం గుండె నొప్పి సమస్యలు పెరిగాయి. – బాలశ్రీనివాస్, జనరల్ ఫిజీషియన్

పంచ సూత్రాలు పాటించాలి



కొందరిలో పుట్టినప్పటి నుంచే గుండె కండరాలు కొంత లావుగా ఉండడంతో సడెన్‌గా రన్నింగ్, డ్యాన్స్, జిమ్ చేస్తే గుండెపోటు వస్తోంది. ప్రతిరోజూ 6నుంచి 7గంటల నిద్ర, గంట వ్యాయామం, సరైన ఆహారం, 3–4లీటర్ల నీరు తాగడం, ప్రశాంతమైన జీవనం గడపాలి. ప్రజావాసాల్లో ఎయిడ్ సిస్టమ్స్ ఏర్పాటుతోపాటు సీపీఆర్‌పై అవగాహన పెరగాలి. – మహేశ్‌బాబు, గుండె వైద్యునిపుణుడు

క్లుప్తంగా

విరిగిపడిన కొండచరియలు



అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు శనివారం రాత్రి కొండచరియలు విరిగిపడ్డాయి. ఆదివారం అటవీశాఖ అధికారులు కొండచరియలు విరిగిపడిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతమంతా ప్రమాదకరంగా ఉందని, చర్యలు చేపట్టాకే భక్తుల దర్శనానికి అనుమతివ్వాలని ఆలయ అధికారులకు సూచించారు. ఉన్నతాధికారులకు విషయం తెలియజేస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు. కాగా నిత్యాన్నదానాన్ని నిలిపివేశామని, తదుపరి ప్రకటిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసులు తెలిపారు.

యువకుడిని కాపాడిన పోలీసులు



మక్తల్: ఆత్మహత్యకు ప్రయత్నించిన యువకుడిని పోలీసులు కాపాడిన సంఘటన మక్తల్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. నారాయణపేట జిల్లాకేంద్రంలోని బహర్‌పేటకు చెందిన లాలు దామరగిద్ద మండలం సాకలోనిపల్లిలోని అత్తగారి ఇంట్లో భార్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో క్షణికావేశానికి లోనై మక్తల్‌కు చేరుకుని రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకుంటున్నానని తన మేనమామతోపాటు డయల్ 100కు ఫోన్ చేశాడు. వెంటనే మక్తల్ ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి స్పందించి పెట్రోలింగ్‌లో ఉన్న డ్యూటీ కానిస్టేబుల్ నరేష్, శ్రీహరిలకు సమాచారం అందించడంతో వారు నారాయణపేట రోడ్డులోని రైల్వే బ్రిడ్జి దగ్గరకు చేరుకొని రైలు పట్టాలపై పడుకొని ఉన్న లాలును కాపాడారు. సమయానికి పోలీసులు రాకుంటే యువకుడి ప్రాణాలు పోయేవని స్థానికులు పేర్కొన్నారు. అనంతరం యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి.. కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కాళరాత్రిదేవీ.. నమోస్తుతే



అలంపూర్‌లో జోగుళాంబ అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లలో నిలిచిన భక్తులు

- అలంపూర్ జోగుళాంబ క్షేత్రంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- తరలివచ్చిన భక్తజనం



సాంస్కృతిక ప్రదర్శనలో కళాకారులు

అలంపూర్: మహిమాన్వితమూర్తి కాళరాత్రిదేవీ నమోస్తుతే.. అంటూ భక్తులు జోగుళాంబ అమ్మవారిని పూజించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అలంపూర్ ఆలయంలో ప్రత్యేక మండపంలో అమ్మవారు కొలువుదీరగా.. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన ఆదివారం అమ్మవారు కాళరాత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈమేరకు అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు, మహా మంగళహారతి ఇచ్చారు. ఆకాశంలో ఉండే మబ్బుల రంగును కలగలుపుకొని.. నల్లటి రూపంతో అతి భీకరంగా అమ్మవారు దర్శనిస్తారని అర్చకులు వివరించారు. అదేవిధంగా యాగశాలలో చండీహోమాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఇదిలాఉండగా, క్షేత్రానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు, ప్రముఖులు తరలివచ్చారు. దీంతో జోగుళాంబ అమ్మవారు, బాలబ్రహ్మేశ్వరస్వామి వార్ల ఆలయాల వద్ద పెద్దసంఖ్యలో క్యూలో బారులు తీరారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు చేశారు. అలాగే, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు. బాలబ్రహ్మేశ్వరస్వామి నిత్య అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదానం చేశారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జోగుళాంబ క్షేత్రంలో సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. గద్వాల సంస్థానం అధ్వర్యంలో గుడి సంబురాల పేరిట సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కళాకారులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించగా.. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు. ఆలయ అధికారులు కళాకారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి : ఎంపీ

జోగుళాంబ అమ్మవారి అశీస్సులు అందరిపై ఉండాలని రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్ అన్నారు. అలంపూర్ క్షేత్ర ఆలయాలను రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, గద్వాల సంస్థాన వారసుడు కృష్ణరామ్ భూపాల్‌తో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ దీప్తి, ఆలయ పాలక మండలి సభ్యులు అర్చకులతో కలిసి స్వాగతం పలికారు. ఈమేరకు అమ్మవారికి పట్టువస్త్రాలను అందజేశారు. అనంతరం బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు, పాలక మండలితో చర్చించి ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం ఆలయ అధికారులు వారిని శేషవస్త్రాలతో సత్కరించారు.



అమ్మవారికి పట్టువస్త్రాలను తీసుకొస్తున్న రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్

ఫుట్‌బాల్ చాంపియన్‌గా వనపర్తి



విజేత వనపర్తి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్

- రన్నరప్‌గా నిలిచిన కరీంనగర్
- సెమీస్‌లో పోరాడి ఓడిన మహబూబ్‌నగర్
- ట్రోఫీలు అందజేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలో ముగిసిన రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ పోటీల్లో విజేతగా వనపర్తి జిల్లా జట్టు నిలిచింది. ఆదివారం వర్షాల నేపథ్యంలో జడ్చర్ల పట్టణంలో నిర్వహించిన వనపర్తి, కరీంనగర్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. మ్యాచ్ ముగిసే సరికి ఇరు జట్లు గోల్స్ చేయకపోవడంతో టై బ్రేకర్ నిర్వహించారు. చివరకు వనపర్తి జట్టు 5–4 గోల్స్ తేడాతో కరీంనగర్ జట్టుపై విజయం సాధించి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. మహబూబ్‌నగర్, గద్వాల జట్లు సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాయి.

సెమీస్‌లో పోరాడి ఓడిన మహబూబ్‌నగర్

మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో వనపర్తి, మహబూబ్‌నగర్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మ్యాచ్ ముగిసే సమయానికి రెండు జట్లు ఎలాంటి గోల్స్ చేయలేదు. దీంతో టై బ్రేకర్ నిర్వహించగా వనపర్తి జట్టు 4–2 గోల్స్ తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై గెలుపొందింది. రెండో సెమీఫైనల్‌లో కరీంనగర్ జట్టు 3– 2 గోల్స్ తేడాతో జోగులాంబ గద్వాల జట్టుపై విజయం సాధించింది.



మూడో స్థానంలో మహబూబ్‌నగర్ జట్టు



మూడో స్థానంలో గద్వాల జట్టు

స్పోర్ట్స్ హబ్‌గా అభివృద్ధి చేసుకుందాం

మహబూబ్‌నగర్‌ను స్పోర్ట్స్ హబ్‌గా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నీలో విన్నర్, రన్నరప్, మూడోస్థానం నిలిచిన జట్లకు ఆయన ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్‌లో ఈ ఏడాది పలు రాష్ట్రస్థాయి టోర్నీలు నిర్వహించినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్‌లో క్రీడా వసతుల ఏర్పాటు కోసం సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాబోయే రోజుల్లో టోర్నీలు నిర్వహించడానికి ముందుకు వచ్చే వారికి అన్ని విధాల వసతులు కల్పించేలా కృషి చేస్తానన్నారు. రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి జీపీ ఫాల్గుణ మాట్లాడుతూ.. వర్షం వచ్చినప్పటికీ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన మహబూబ్‌నగర్ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఫుట్‌బాల్‌లో ప్రతిభ చాటే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షులు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, ఉపాధ్యక్షులు రమేష్, రంగారావు, శంకర్‌లింగం, గజానంద్‌కుమార్, రాష్ట్ర సంఘం కోశాధికారి గణపతి, వనపర్తి జిల్లా అధ్యక్షులు కృష్ణకుమార్ రెడ్డి, నాగేశ్వర్, నందకిషోర్, జేమ్స్ ఇమ్మాన్యుయేల్, రామకృష్ణ, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు భారీగా వరద

- 5.07 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రాజెక్టు 39 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 6 యూనిట్లలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



జూరాల 39 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు మూడు గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

ధరూరు: కర్ణాటక, మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో భారీగా ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 4.31 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఆదివారం రాత్రి 7.30 గంటల వరకు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 5.07 లక్షల క్యూసెక్కులకు పెరిగిందన్నారు. ఈ సీజనలో ఇంత పెద్ద మొత్తంలో ఇన్‌ఫ్లో రావడం ఇదే మొదటిసారి. దీంతో ప్రాజెక్టు 39 క్రస్టు గేట్లను ఎత్తి 5.20 లక్షల క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 22 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 5.20 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.569 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 32.052 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టుకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 25 గేట్లను ఎత్తి దిగువన ఉన్న జూరాలకు 95,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రెండో రోజు నిలిచిన విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు ఎగువ కర్ణాటక నుంచి 5.07 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటంతో ఆదివారం రెండో రోజు ఎగువ, దిగువ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని నిలిపేసినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 741.652 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.

సుంకేసులకు మళ్లీ పెరిగిన వరద

రాజోళి: సుంకేసుల డ్యాంకు వరద భారీగా పెరిగింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో పాటు కురుస్తున్న వర్షాల కారణంగా డ్యాంలో నీటిమట్టం పెరుగుతుంది. ఆదివారం ఉదయం నాటికి 1.09 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా 24 గేట్లను మీటర్ మేర ఎత్తి 1.05 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు కేసీ కెనాల్‌కు 2,012 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

రామన్‌పాడుకు కొనసాగుతున్న వరద

మదనాపురం: రామన్‌పాడు జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. కోయిల్‌సాగర్, సరళాసాగర్ జలాశయాల ద్వారా వరద రావడంతో అధికారులు 3 గేట్లు ఎత్తి 18 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. సరళాసాగర్ ప్రాజెక్టు ఒక ప్రైమరీ సైఫాన్, ఒక ఉడ్ సైఫాన్ ద్వారా 4 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్లింది. వరద ప్రభావంతో మదనాపురం వద్ద కాజ్వే మునిగింది.

మూడు గేట్లు ద్వారా నీటి విడుదల

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు మూడు గేట్ల ద్వారా 3 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. శనివారం వరద ఉధృతి భారీగా ఉండడంతో 7 గేట్లను తెరువగా ఆదివారం వరద తగ్గుముఖం పట్టడంతో నాలుగు గేట్లను మూసివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా ప్రస్తుతం 32.4 అడుగులుగా ఉంది.

కంటి వైద్య నిపుణుడి అదృశ్యం

- బాకీ తీర్చలేక 4 నెలల క్రితం స్నేహితుడి ఆత్మహత్య.. జామీనుగా ఉన్నందుకు అప్పులోళ్ల ఒత్తిడి
- 17 పేజీల ఆత్మహత్య లేఖ రాసి.. సెల్‌ఫోన్ వదిలి వెళ్లిన వైనం
- తల్లిదండ్రుల ఫిర్యాదు.. ఆచూకీ కోసం పోలీసుల గాలింపు



పాత్లావత్ రమేష్‌నాయక్

మద్దూరు: అప్పు తీర్చలేక నాలుగు నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్న స్నేహితుడు.. అతడికి జామీనుగా ఉన్న నేత్ర వైద్యుడిపై అప్పులోళ్ల తీవ్ర మైన ఒత్తిడి... దాన్ని తట్టుకోలేక 17 పేజీల సూసైడ్ నోట్ రాసి సెల్‌ఫోన్ ఇంటి దగ్గరే వదిలి అదృశ్యమయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని గోకఫస్లావాద్ గ్రామ పరిధిలోని బోడమర్రిగడ్డతండాకు చెందిన పాత్లావత్ రమేష్‌నాయక్ పదేళ్ల నుంచి నారాయణపేట జిల్లా మద్దూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఐ–మిత్ర కంటి పరీక్ష కేంద్రం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మద్దూరుకు చెందిన రక్త పరీక్షలు చేసే రామచంద్రయ్య మిత్రుడుగా మారాడు. అయితే రామచంద్రయ్య స్థానిక ఆర్‌ఎంపీ వద్ద అప్పు తీసుకునేటప్పుడు రమేష్‌నాయక్ జామీను ఇచ్చాడు. ఈ క్రమంలో అప్పు తీర్చలేకపోయిన రామచంద్రయ్య ఈ ఏడాది మే 23న ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో తన అప్పు తీర్చాలని ఆర్‌ఎంపీ, అతని తమ్ముడు రమేష్‌నాయక్‌పై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో మనస్తాపం చెందిన రమేష్‌నాయక్ 17 పేజీల ఆత్మహత్య లేఖ రాసి సెల్‌ఫోన్ కంటి వైద్య కేంద్రంలోనే వదిలేసి మిత్రుడు చిన్నస్వామి బైక్‌పై వెళ్లి నారాయణపేట బస్టాండ్‌లో దిగాడు. తాను రాసిన ఆత్మహత్య లేఖను కొంతమంది సెల్‌ఫోన్‌లకు పంపించాడు. ఇది వైరల్‌గా మారి.. తల్లిదండ్రులకు తెలియడంతో మద్దూరు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ విజయ్‌కుమర్ కంటి పరీక్ష కేంద్రం చేరుకొని ఆత్మహత్య లేఖతోపాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై రమేష్‌నాయక్ తండ్రి దామ్లానాయక్ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేశారు. రమేష్‌నాయక్ ఆచూకీ కోసం రెండు పోలీసు బృందాలను పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు. సీసీ టీవీ పుటేజీలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.



మద్దూరులో కంటి పరీక్ష కేంద్రం పరిశీలిస్తున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్